క్లుప్తంగా

రెవెన్యూ గ్రామ సభకు 36 అర్జీలు

సంతనూతలపాడు: మండలంలోని గురువారెడ్డి పాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన రీ సర్వే రెవెన్యూ గ్రామ సభకు రైతుల నుంచి 36 అర్జీలు వచ్చాయి. సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి మాట్లాడుతూ 45 రోజుల్లో రైతుల అర్జీలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్‌తేజ, వీఆర్ఓ రామాంజనేయులు, గురవారెడ్డిపాలెం సర్పంచ్ మారెడ్డి విజయలక్ష్మి, పవన్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీని తనిఖీ చేసిన ఆర్డీఓ

సంతనూతలపాడు: మండలంలోని మద్దులూరు గ్రామంలో శనివారం రేషన్ బియ్యం పంపిణీని ఒంగోలు ఆర్డీఓ కే లక్ష్మీప్రసన్న తనిఖీ చేశారు. సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, ఆర్ఐ పి.రామ్‌తేజ, మద్దులూరు సర్పంచ్ ఎం.శైలజ,వీఆర్వో కే హనుమంతరావు,పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మద్దిపాడు: స్థానిక నటరాజ కళా కేంద్రంలో ఒంగోలు యామిని కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

జీవనోపాధికి సూర్యశ్రీ ట్రస్ట్ ఆర్థికసాయం

ఒంగోలు సిటీ: సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు సత్యనారాయణపురంలో నివాసం ఉంటున్న రావూరి మోజెస్ జీవనోపాధికి చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు శనివారం రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ చైర్‌పర్సన్ షేక్ షహనాజ్, కార్యదర్శి షేక్ సర్దార్ బాషా పాల్గొన్నారు.

ఆటో-బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్దిపాడు: ఆటో-బైకు ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన మద్దిపాడు మండల శివారు ప్రాంతంలో చీరాల రోడ్డుపై శనివారం చోటుచేసుకుంది. ఒంగోలు వైపు నుంచి చీరాల వైపు ఆటో వెళుతుండగా బ్రేక్ ఫెయిలై అదుపుతప్పి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది ఈ ప్రమాదంలో బైకుపై వెళ్తున్న పర్చూరుకు చెందిన ఎస్.కె.కాశింపీరాకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

8న సంతనూతలపాడు మండల సమావేశం

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని కార్యాలయ భవనంలో ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీపీ విజయ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

పలు సేవా కార్యక్రమాలు

ఒంగోలు మెట్రో: ప్రీతమ్ అమర్త్య వంకాయలపాటి పుట్టినరోజు సందర్భంగా ప్రీతమ్ వర్షిత హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు కొమ్మి రమణయ్య, రాజేశ్వరి ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలు కర్నూల్ రోడ్డులో రావి అంజయ్య రోడ్డులో గుడ్ న్యూస్ మినిస్టరీ పాఠశాలలో బియ్యం, నిత్యావసర వస్తువులతో పాటు అంధులకు బ్రెయిలీ బుక్స్ అందజేశారు. ఒంగోలు హౌసింగ్ బోర్డులోని బొమ్మరిల్లు అనాథ పిల్లల ఆశ్రమంలో భోజనం ఏర్పాటు చేశారు. పిల్లలకు నోట్ బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, మారెళ్ల రాజేశ్వరి, వంకాయలపాటి సత్యవతి, శ్రీదేవి, గుడ్ న్యూస్ మినిస్ట్రీ నిర్వాహకులు స్వర్ణ మోహన్‌రావు, బొమ్మరిల్లు నిర్వాహకులు ఖాసీం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



కొత్తపట్నం బస్టాండ్ వద్దగల శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు





శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక పూజకు వేళాయే..!

- శైవక్షేత్రాల్లో కార్తీక శోభ
- ముస్తాబైన శివాలయాలు
- నెల రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారుల ఏర్పాట్లు



కొత్తపట్నం బస్టాండ్ శివాలయంలో శివుడి దర్శనానికి బారులుదీరిన భక్తులు



విద్యుత్ దీపాల అలంకరణలో కేశవస్వామిపేటలోని కాశీవిశ్వనాథుని దేవస్థానం



పాపాకాలనీలో ముస్తాబైన శివాలయం

ఒంగోలు మెట్రో: కార్తీకమాసం ప్రారంభం కావడంతో శనివారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. నెలరోజుల పాటు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగనున్నాయి. ఇప్పటికే రంగులు వేసి విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. శివాలయాలన్నీ కార్తీక శోభను సంతరించుకున్నాయి. కార్తీక మాసంలో ఆలయాలకు పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం ఒంగోలు నగరంలోని ప్రముఖ శైవక్షేత్రాలలో శివునికి ప్రదోషకాలంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక లాయరుపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న మరకత శివలింగానికి, కేశవస్వామిపేటలోని కాశీ విశ్వనాథుని దేవాలయంలో, రంగారాయుడు చెరువు దగ్గర అరుణాచలేశ్వరస్వామికి, అంజయ్య రోడ్డులోని సాయి శివ పంచముఖ క్షేత్రంలో, కొత్తపట్నం బస్టాండ్ శివాలయంలో, మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్లో హరిహరసుత అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా బాలాజీరావుపేటలోని దుర్గామల్లేశ్వరస్వామికి, గాంధీనగర్లో రామలింగేశ్వరస్వామికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి, సమతానగర్లోని సాగర్ కాల్వ దగ్గర దుర్గామల్లేశ్వరస్వామికి ఆలయ అర్చకులు ప్రదోషకాలంలో శివలింగం మూలవిరాట్‌కు వివిధ రకాల పండ్ల రసాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి శివునికి ప్రీతికరమైన బిల్వ దళాలతో శివ అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. కర్పూర హారతులతో భక్తులకు స్వామివారి దివ్యదర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చిత్రలేఖనంపై మక్కువ పెంచుకోవాలి



విద్యార్థులకు ప్రశంసపత్రాలు, గోల్డ్ మెడల్స్ అందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: చిత్రలేఖనంపై చిన్నారులు మక్కువ పెంచుకోవాలని ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు అన్నారు. శనివారం ఒంగోలు అంబేడ్కర్ భవనంలో నేషనల్ చిల్డ్రన్స్ పెయింటింగ్ కాంపిటీషన్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించగా, హరిబాబు పాల్గొని మాట్లాడారు. చిత్రలేఖనంలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న సృష్టి అకాడమీ, కళాయజ్ఞ సంస్థలను అభినందించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రముఖ చిత్రకారులు తిమ్మిరి నరసింహారావు, డాక్టర్ తిమ్మిరి నరేష్‌బాబు, ఏలూరి వెంకటసుబ్బారావు చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గాయకుడు నూకతోటి శరత్‌బాబు, హ్యూమన్ రైట్స్ భానుచందర్, చంద్రశేఖర్, తదితరులు ప్రసంగించారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసపత్రాలతోపాటు గోల్డ్ మెడల్స్ అందజేశారు.

అయ్యప్పస్వాములకు అన్నదానం ప్రారంభం



అన్నదాన కార్యక్రమానికి హాజరైన మాలధారులు

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు గ్రామంలో అంకమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో అయ్యప్పమాల ధరించిన భక్తులకు శనివారం నుంచి అన్నదానాన్ని ప్రారంభించారు. గ్రామ ఉపసర్పంచ్, గురుస్వామి కుంచాల అంజయ్య, వెంకట మారుతీదేవి దంపతుల ఆధ్వర్యంలో వరుసగా రెండో ఏడాది అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. మొదటిరోజు 100 మంది భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు. కార్తీక మాసం ముగింపు అయిన డిసెంబర్ ఒకటో తేదీ వరకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎండ్లూరు సర్పంచ్ ఎస్.పుల్లయ్య, ఎంపీటీసీ కే వెంకటేశ్వరరావు, గురుస్వాములు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బూచేపల్లి ఆర్థిక సాయం



ఖాదర్‌బాషాకు నగదు అందిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి శనివారం రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఆశ్రమంలో వృద్ధులకు సేవచేయాలనే ఉద్దేశంతో చీమకుర్తిలోని రామ్‌రాజీవ్‌నగర్‌లో నూతనంగా ఆశ్రమాన్ని ఏర్పాటు చేస్తున్న విషయాన్ని స్వయంగా తెలుసుకుని బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆర్థిక సాయం అందించారు. తన తండ్రి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం వృద్ధులకు సేవలందించాలనే ఉద్దేశంతో ఆర్థికసాయం చేస్తున్నట్లు బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. ఖాదర్‌బాషాను అభినందించి వృద్ధులకు మంచి సేవలు అందించాలని సూచించారు. రానున్న రోజుల్లో వృద్ధాశ్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందించిన బూచేపల్లి శివప్రసాదరెడ్డికి ఖాదర్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి: ఉప్పలపాడులోని 33 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఇండస్ట్రియల్ ఏరియాతో పాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ రామ్‌మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిచెట్లపాలెం, బూదవాడ, ఆర్.ఎల్.పురం, పులికొండ, పాటిమీదపాలెం, నాయుడుపాలెం, తొర్రగుడిపాడు పరిసర గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. ప్రజలు, రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గెలుపోటములు సహజం

- సీడీసీ డీన్ ప్రొఫెసర్ సోమశేఖర



క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న డీన్

ఒంగోలు సిటీ: గెలుపోటములు సహజమైనప్పటికీ క్రీడాకారులు సమష్టి కృషితో రాణించాలని సీడీసీ డీన్ ప్రొఫెసర్ సోమశేఖర పిలుపునిచ్చారు. జమ్మూలోని యూనివర్సిటీ ఆఫ్ జమ్ములో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర టోర్నమెంట్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు శనివారం క్రీడాదుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు బాధ్యతగా ఆటలో నైపుణ్యాలు ప్రదర్శించడం ద్వారా లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని సూచించారు. అనంతరం అంతర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను, గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగే తైక్వాండో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు డీన్ సోమశేఖర, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్ అభినందించారు. సెలక్షన్ కమిటీ సభ్యులు పీడీ జి.సాయి సురేష్ క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనే జట్టుకు అడపాల వెంకటేశ్వర్లు, తైక్వాండో పోటీల్లో పాల్గొనే జట్టుకు రాజేష్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నారు.

రోడ్ల నిండా మురుగు.. దుర్గంధం

- మురుగు కాలువల్లో పూడిక తీసి రోడ్లపై చల్లుతున్న వైనం
- పూడిక తరలించే ట్రక్కుకు డోర్లు వేయకపోవడమే కారణం
- కనీస బాధ్యత లేకుండా పనిచేస్తున్న నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది
- ముక్కులు మూసుకుని ప్రయాణిస్తున్న వాహనదారులు, ప్రజలు



డోరు వేయకుండానే కాలువలోని మురుగును తరలిస్తున్న ట్రాక్టర్



పాత గుంటూరు రోడ్డుపై పడిన మురుగు, రాళ్లు

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి రోజురోజుకూ అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఏం చేసినా అడిగేవారు లేరన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఒంగోలు నగరంలో దాదాపు 3 లక్షలకుపైగా జనాభా ఉన్నారు. జిల్లా కేంద్రం కావడంతో ప్రతిరోజూ లక్షల్లో ప్రజలు వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ఒంగోలు నగరంలోని రోడ్ల నిండా మురుగు వెదజల్లి దుర్గంధం నింపారు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది. అడిగేవారు లేరనో, అడిగినా సమాధానం చెప్పాల్సిన అవసరం లేదనో తెలీదుగానీ.. మురుగు కాలువలను శుభ్రం చేసే వంకతో అధికార పార్టీ నాయకులకు గిట్టని వారి షాపుల ముందున్న మురుగు కాలువలపై ఉన్న సిమెంటు స్లాబులను అడ్డగోలుగా పగలకొట్టి తొలగించారు. ఆ మురుగు కాలువల్లో పూడిక తీస్తున్న మురుగు, చెత్త, మట్టిని ట్రాక్టర్ల ద్వారా పాత గుంటూరు రోడ్డు నుంచి కొత్త కూరగాయల మార్కెట్‌కు ఆనుకుని ఉన్న ఊరచెరువు డంపింగ్ యార్డులో పోస్తున్నారు. కానీ, ట్రాక్టర్లకు వెనుక వైపు డోర్ వేయకపోవటంతో మురుగంతా పాత గుంటూరు రోడ్డులోని పోతురాజు కాలువ దగ్గర నుంచి అద్దంకి బస్టాండ్ సెంటర్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, బండ్లమిట్ట మీదుగా ఊరచెరువు వరకు రోడ్లపై నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ముక్కులు పగిలేలా దుర్వాసన వస్తుండటంతో శనివారం వాహనదారులు, ప్రజలు ముక్కులు మూసుకుని ఆ రోడ్లపై ప్రయాణిస్తూ తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వాహనాలు తిరిగేకొద్దీ ఆ మురుగు ఎండిపోయి రోడ్ల వెంట ఉన్న షాపుల్లోకి దుమ్ముధూళి రూపంలో వచ్చేస్తోంది. ఒంగోలు నగరపాలక సంస్థ అధికారుల అధ్వానపు పనితీరును నగర ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రచారం ఆర్భాటం మినహా విధుల్లో పారదర్శకత లేదన్నది ఇప్పటికే నగర ప్రజలకు అర్థమైపోయింది. అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ ప్రజల అవస్థలను గాలికివదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పాత గుంటూరు రోడ్డులో కాలువలోని మురుగును ట్రాక్టర్ ట్రక్కులో నింపుతున్న పొక్లెయిన్